# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **గిరిజన సమాజాలను అభివృద్ధి చేస్తేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు.**

**2.** **దేశ జౌళి ఉత్పత్తులను 9 లక్షల కోట్లరూపాయలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు.**

**3.** **తిరుపతి వేదికగా అంతర్జాతీయ దేవాలయాల సదస్సు ఈరోజు ప్రారంభమవుతుంది..**

**4.** **అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణా ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు.**

**5.** **తెలంగాణా రాష్ట్రంలో పెద్ద గట్టు జాతర కన్నుల పండువగా జరుగుతోంది.**

**6.** **క్రికెట్ క్రీడాభిమానులను అలరించే ఐ.పి.ఎల్. షెడ్యూల్ నిన్న విడుదలైంది.**

==========================

గిరిజన సమాజాలను అభివృద్ధి చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. ఢిల్లీలో “ఆది మహోత్సవ్ – 2025” కార్యక్రమాన్ని నిన్న ఆమె ప్రారంభిస్తూ .... గిరిజన ప్రజల సంప్రదాయాలు ...., జీవన విధానం దేశ సంస్కృతిని సుసంపన్నం చేస్తాయని అన్నారు. భారత దేశ గిరిజన ప్రజల శక్తిమంతమైన సంస్కృతి, వారసత్వం, ఆర్థిక శక్తిని ప్రదర్శించడమే ఈ ఆది మహోత్సవ్ ముఖ్యోద్దేశమని ద్రౌపదీ ముర్ము పేర్కొంటూ .............

..వాయిస్.. 41 సెకన్లు

--------------------------

వస్త్ర రంగంలో భారత దేశ ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. భారత దేశం ఈ రోజున ఆరవ అతి పెద్ద ..., వస్త్ర..., దుస్తుల ఎగుమతిదారుగా రూపుదిద్దుకుందని వెల్లడించారు.

ఢిల్లీలోని భారత మండపంలో భారత్ టెక్స్– 2025 కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ..... వస్త్ర రంగంలో భారత దేశ ఎగుమతులు ప్రస్తుతం మూడు లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నాయని ప్రకటించారు. వచ్చే

2030 సంవత్సరం నాటికి వీటిని తొమ్మిది లక్షల కోట్ల రూపాయలకు చేర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని నరేంద్రమోదీ పేర్కొంటూ .....

.వాయిస్..37 సెకన్లు

భారత్ టెక్స్ ప్రదర్శన ప్రాంతాన్ని నిన్న సందర్శించిన ప్రధాన మంత్రి అక్కడి వస్తు ఉత్పత్తి దారులతో కొద్ది సేపు సంభాషించారు. ఈ నెల 14 వ తేదీన ప్రారంభమైన ఈ ప్రపంచ స్థాయీ కార్యక్రమం ఈరోజుతో ముగుస్తోంది.

---------------------------

ఢిల్లీలోని ఎన్.సి.ఆర్. ప్రాంతంలో ఈ రోజు తెల్లవారుజామున భూ కంపం సంభవించింది. 5 గంటల 36 నిముషాల ప్రాంతంలో అయిదు కిలోమీటర్ల లోతులో భూ ప్రకంపనలు సంభవించాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ఢిల్లీ, నోయిడా..., ఇందిరాపురం..., ఇతర ఎన్.సి.ఆర్. ప్రాంతాలను తాకిన ఈ భూకంపం 28.59 ఉత్తర అక్షాంశం ..., 77.16 తూర్పు రేఖాంశంలో ఉందని ఆ సంస్థ వివరించింది. భయాందోళనలకు గురైన ఆ ప్రాంత ప్రజలు ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు. ఆస్తి ..., ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది.

---------------------------

అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాదులో నిన్న జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ .... అధికారులు ఎంత నిబద్ధతతో పని చేస్తే ప్రభుత్వ పథకాలు అంత విజయవంతం అవుతాయని అన్నారు. నిబద్ధతతో పని చేసే అధికారులను ప్రభుత్వం గుర్తించి ప్రాధాన్యత నిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని విధానాలు .... పథకాలు రూపొందించినప్పటికీ .... వాటిని అమలు చేసేది అధికారులేనని రేవంత్ రెడ్డి పేర్కొంటూ .....

..వాయిస్...15 సెకన్లు

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ నెల 27వ తేదీన జరగనున్న తూర్పు గోదావరి –పశ్చిమ గోదావరి...., ఉమ్మడి కృష్ణా ..., గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా పార్టీల శ్రేణులు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పని చేయాలని కోరారు. నేతలు క్షేత్ర స్థాయిలో సమన్వయం చేసుకుని ఓటర్లను చైతన్య పరచాలని ...., ప్రజల నమ్మకం నిలబెట్టుకునేందుకు నిత్యం కృషి చేయాలని కూడా చంద్రబాబు నాయుడు కూటమి పార్టీల శ్రేణులకు సూచించారు.

---------------------------

అంతర్జాతీయ దేవాలయాల సదస్సు తిరుపతి వేదికగా ఈ రోజు నుండి మూడు రోజులపాటు జరగనున్నది. మహారాష్ట్ర శాసన మండలి సభ్యుడు ...., ప్రభుత్వ విప్ ప్రసాద్ లాడ్ నిన్న తిరుపతిలో పాత్రికేయులకు తెలియజేస్తూ

.... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించే ఈ సదస్సులో మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ... గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కూడా పాల్గొంటారని చెప్పారు. ఆలయ నిర్వహణకు సంబంధించిన ఉత్తమ పద్ధతులను అన్వేషించడం ..., స్థిరమైన పర్యావరణ వ్యవస్థలు వంటి అంశాలపై ఈ సదస్సు చర్చిస్తుందని ప్రసాద్ లాడ్ వివరిస్తూ ......

..వాయిస్... 27 సెకన్లు

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో రెండవ పెద్ద జాతరగా పేరొందిన .... "దురాజ్ పల్లి లింగమంతుల స్వామి పెద్ద గట్టు జాతర" నిన్న ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ వరకు జరిగే ఈ జాతర సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. మేడారం సమ్మక్క – సారక్క జాతర మాదిరిగానే ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ జాతర నిర్వహిస్తారు. పెద్ద గట్టు జాతరనే గొల్ల గట్టు జాతర అని కూడా పిలుస్తారు. ఈ జాతరలో భాగంగా యాదవుల కులదైవం ఎద్ద గట్టు లింగామంతుల స్వామి ఇక్కడ పూజలు అందుకుంటారు.

---------------------------

పెద్ద గట్టు జాతర సందర్భంగా హైదరాబాదు–విజయవాడ జాతీయ రహదారిపై నార్కెట్ పల్లి వద్ద వాహనాలను దారి మళ్ళిస్తున్నామని పోలీసులు తెలిపారు. హైదరాబాదు నుండి విజయవాడ వెళ్ళే వాహనాలను నార్కెట్ పల్లి వద్ద నుండి నల్గొండ, మిర్యాలగూడ, హుజూర్ నగర్, కోదాడ మీదుగా మళ్లీస్తున్నామని వారు తెలిపారు. కాగా .... విజయవాడ నుండి హైదరాబాదు వైపు వెళ్ళే వాహనాలను కోదాడ, హుజూర్ నగర్, మిర్యాలగూడ, నల్గొండ, నార్కెట్ పల్లి మీదుగా వాహనాలను అనుమతిస్తున్నారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ... ఐ. పి. ఎల్ – 2025 షెడ్యూల్‌ను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు నిన్న విడుదల చేసింది. దీని ప్రకారం .... ఐ.పి.ఎల్. మ్యాచ్‌లు మార్చి 22 వ తేదీ నుండి ప్రారంభమై మే 25 వ తేదీతో ముగుస్తాయి. మొత్తం 65 రోజులపాటు 74 మ్యాచ్‌లు క్రికెట్ అభిమానులను అలరించనున్నాయి.. మార్చి 22వ తేదీన ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్ కత్తా నైట్ రైడర్స్ –రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్‌తో ఐ.పి. ఎల్. మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.

---------------------------

తెలంగాణా ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బొగ్గు గనుల శాఖ మంత్రి ...., భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి విమర్శించారు.

హనుమకొండ పట్టణంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు ఏడాదిలోనే తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ...., ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేవలం మాటలతోనే పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల పరిస్థితి దయనీయంగా ఉందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

---------------------------

తెలంగాణా రాష్ట్ర అప్పులపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు ...., మాజీ మంత్రి కె. తారక రామారావు నిన్న బహిరంగ లేఖ రాశారు. భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులతో ప్రజలు ఎదుర్కొన్న అనేక కష్టాలు తీర్చామని, రాష్ట్ర దశ, దిశను మార్చామని చెప్పారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన తరువాత కూడా తెలంగాణా మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని స్పష్టం చేశారు. కేంద్రమే భారీ ఎత్తున అప్పులు చేస్తోందని, ప్రతి బడ్జెట్‌లో తెలంగాణాకు నిధులు సక్రమంగా ఇవ్వడం లేదని ఆ లేఖలో తారక రామారావు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న దమయ్యపర్తి మురుగు కాల్వ ప్రక్షాళన పనులను 14 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్నట్టు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

ఈ మురుగు కాల్వను నిన్న ఆయన పరిశీలించి మాట్లాడుతూ ..... పాలకొల్లు దుఃఖదాయనిగా ఉన్న ఈ కాల్వ ప్రక్షాళన పనులను ప్రభుత్వం పూర్తి చేసి పాలకొల్లు పట్టణాన్ని ముంపు బారి నుండి కాపాడతామని హామీ ఇచ్చారు.

======================